క్లుప్తంగా

అభినందనలు



ద్వారపు అజిత్‌కుమార్ దంపతులను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా ఇటీవల నియమితులైన ద్వారపు అనురాధకు ఎల్‌బీఎస్ కాలనీ అసోసియేషన్ తరపున ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ద్వారపు అజిత్‌కుమార్, అతని భార్య అనురాధలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు కాలనీ అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారని చెప్పారు. అజిత్‌కుమార్ మాట్లాడుతూ తన భార్యకు పాలకమండలి సభ్యురాలిగా స్థానం కల్పించినందుకు మంత్రి ధర్మాన ప్రసాదరావు, రామ్‌మనోహర్‌నాయుడు, ఎచ్చెర్ల వెంకటసూర్యనారాయణ, ఎంవీ పద్మావతిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కాసిన సూర్యప్రసాద్, బూరవిల్లి మురళి, బరాటం లక్ష్మణరావు, మీనా, సాయిప్రసాద్, సిగిరెడ్డి నాగు, కమినాయుడు, గోపి, పుప్పాల ఆనందమోహన్, రొక్కం ప్రేమ్‌నాద్, అసిరినాయుడు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

శ్రీకాకుళం రూరల్: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో జరగనుంది. ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని అధికారులు కోరారు.

మంచినీటి బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని సానివాడ పంచాయతీ పరిధిలో అంబేడ్కర్ నగర్ కాలనీలో ఆదివారం మంచినీటి బోరును ప్రారంభించారు. ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాలనీవాసులు తాగునీటి సమస్యను మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో సచివాలయానికి మంజూరైన నిధులతో బోరు ఏర్పాటు చేయించగా.. మాజీ సర్పంచ్ రుప్ప అప్పలసూరి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉంగటి గోపాలరావు, రామ గోవిందరావు, కంబాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిగిరి వార్షికోత్సవం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాదుర్లపేట వద్ద సాయిగిరి దివ్యమందిరం 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా సాయిబాబాకు సుప్రభాతసేవ, అభిషేకాలు నిర్వహించి హారతులు ఇచ్చారు. సామూహిక సాయివ్రతాలు నిర్వహించి సాయినాథునికి చందనోత్సవం చేశారు. మధ్యాహ్నం సుమారు ఐదు వేల మందికి అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఆలయ కమిటీ సభ్యులు గుత్తు చిన్నారావు, బి.వి.ఆర్.మూర్తి, సాయి భక్తులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత



ఆర్థిక సహాయం అందజేస్తున్న తోటి విద్యార్థులు

మెళియాపుట్టి: స్నేహితుడు కష్టకాలంలో ఉన్నట్లు తెలుసుకుని తోటి స్నేహితులు రూ.22,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండలంలోని సంతలక్ష్మీపురం గ్రామానికి చెందిన రంధి దామోదరం గతకొంతకాలంగా కిడ్నీవ్యాధితో బాధపడుతున్నారు. కరజాడ గ్రామంలో 1998–99లో పదో తరగతి కలిసి చదువుకున్న వారందరూ ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. దామోదరం ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వెంటనే డబ్బులు జమ చేసి అందించారు. దామోదరం కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కృష్ణారావు, రామారావు, కుమారస్వామి, హరికృష్ణ, రాధాకృష్ణ, నిర్మల, త్రివేణి, తులసమ్మ, జగదీష్, భాస్కరరావు, జనార్దన తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు!

- కార్పొరేషన్ పరిధిలో ఎండిపోయిన మొక్కలు
- నిర్వహణను పట్టించుకోని కాంట్రాక్టర్లు
- దృష్టి సారించని అధికారులు



రిమ్స్ ఆస్పత్రి సమీపంలో భారతీనగర్‌కాలనీలో మోడుబారిన మొక్కలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం, స్వచ్ఛమైన గాలిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న 'హరిత వనాలు' పేరిట రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. మొదట్లో వేలాదిగా మొక్కలు నాటి హడావుడి చేశారు. వాటిని సంరక్షించాల్సిన కాంట్రాక్టర్లు, అధికారులు పర్యవేక్షణ బాధ్యతను గాలికొదిలేశారు. ఫలితంగా ఎక్కడికక్కడ మోడుబారిపోయి ఎండిపోయిన కర్రల్లా దర్శనమిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

హరితవనాల సంరక్షణ బాధ్యతలను అధికారులు ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించారు. టెండర్లు పిలిచి తక్కువకు కోడ్ చేసేవారికి మొక్కలు నాటే బాధ్యతను అప్పగించారు. మొత్తం 11 వేలకు పైగా మొక్కలు నాటేందుకు కార్పొరేషన్ అధికారులతో సంబంధిత కాంట్రాక్టర్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రధానంగా నగరంలోని కంపోస్టుకాలనీ, శ్రీలక్ష్మీనగర్, శాంతినగర్‌కాలనీ, చాపురం, కిల్లిపాలెం, రామలక్ష్మణ కూడలి–పెద్దపాడు రోడ్డు, ఎల్‌బీఎస్ కాలనీ, పీఎల్‌కాలనీ, తెలుగు ముసలయ్య కాలనీ, వాంబేకాలనీ, గుజరాతీపేట, మహలక్ష్మీనగర్‌కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ, డీసీసీబీ కాలనీ, సానావీధి, ఏఎస్‌కాలనీ, ఇందిరానగర్ కాలనీల్లో మొక్కలు నాటారు.

కానరాని సంరక్షణ..

వాస్తవానికి మొక్కలు నాటాక వాటి సంరక్షణ బాధ్యత ఆరు నెలల వరకు కాంట్రాక్టర్లే చూసుకోవాల్సి ఉంటుంది. అయినప్పటికీ తమకేం పట్టనట్లు కాంట్రాక్టర్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కల స్థితిగతులను పట్టించుకోవాల్సిన కార్పొరేషన్ హార్టీకల్చర్, ఇంజనీరింగ్ అధికారులు సైతం పర్యవేక్షించడంలో విఫలమయ్యారు. దీంతో ప్రభుత్వ లక్ష్యాన్ని గాలికొదిలేసి ప్రజలకు స్వచ్ఛమైన గాలినందించాల్సిన మొక్కలు మోడుబారి దర్శనమిస్తున్నాయి. నగరంలో చాలా చోట్ల ఎండిన కర్రల్లా కనిపిస్తున్నాయి. కొంతమంది స్థానికులే చొరవతీసుకుని కొన్ని మొక్కలను కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభాకర్‌నగర్‌కాలనీలో బుట్ట ధ్వంసమై నేలవాలిన మొక్క

బతికిన మొక్కలకే బిల్లులు..



కార్పొరేషన్ పరిధిలో చాలా కాలనీల్లో మొక్కలు నాటాం. పశువుల సంచారం ఎక్కువగా ఉండడంతో మొక్కలు పాడవుతున్నాయి. పాడైన చోట్ల మొక్కలను రీప్లేస్ చేస్తున్నాం. ఆరు నెలలు పాటు మొక్కల సంరక్షణ బాధ్యత కాంట్రాక్టర్లదే. మొక్క బతికితేనే బిల్లు ఇస్తాం.

– చల్ల ఓబులేసు, కార్పొరేషన్ కమిషనర్, శ్రీకాకుళం

నాటారు.. వదిలేశారు..



ప్రజారోగ్యం కాపాడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం ఆనందదాయకం. నాటిన మొక్కలు చాలాచోట్ల ఎండిపోయి కర్రల్లా కనిపిస్తున్నాయి. మా ప్రాంతంలో మొక్కలను మేమే చుట్టూ రక్షణ కల్పించి సంరక్షిస్తున్నాం.

– పి.శ్రీనివాసరావు, భారతీనగర్‌కాలనీ, శ్రీకాకుళం

విస్తృతంగా పట్టభద్రుల ఎన్నికల ప్రచారం



ఎర్రవరంలో ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రణస్థలం: ఉత్తరాంధ్రుల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ కోరారు. మండలంలోని రావాడ, ఎర్రవరం, తెప్పలవలస, వి.ఎస్.పురం పంచాయతీల్లో ఎన్నికల ప్రచార కరపత్రాలను పట్టభద్రులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 13న జరగబోయే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, మహంతి పెదరామినాయుడు, గొర్లె శ్రీనివాసరావు, బొమ్మలాట శ్రీరాములు, దన్నాన హరి, కొయ్య సోములు రెడ్డి, లంక సీతంనాయుడు, బోనెల చంద్రశేఖర్, యామల కృష్ణ, పాపారావు, కిల్లారి సూర్యనారాయణ, కిల్లారి రమణ తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల విజేతలకు ప్రోత్సాహం

వజ్రపుకొత్తూరు రూరల్: మహా శివరాత్రి మహోత్సవం సందర్భంగా గుళ్లలపాడులో శనివారం రాత్రి నిర్వహించిన జిల్లాస్థాయి నృత్య పోటీల్లో గెలిపొందిన విజేతలకు నిర్వాహకులు నగదు ప్రోత్సాహం అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయతో పాటు మరో రెండు స్థానాల్లో డాన్స్ బృందాలను ఎంపిక చేశారు. కళాకారులు జానపద, సినిమా పాటలకు నృత్యాలు చేస్తూ అలరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ పెద్దలు, తదితరులు ఉన్నారు.

శివారు ఆయకట్టుకు సాగునీరు

వజ్రపుకొత్తూరు: వంశధార శివారు ప్రాంతాలైన నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలకు సాగునీరు అందిచేందుకు రూ.8 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని బీఆర్‌ఆర్ వంశధార ప్రాజెక్టు టెక్కలి ఈఈ కొత్తకోట శ్రీకాంత్ చెప్పారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఏటా మదనగోపాల సాగరం నిండేందుకు సమయం పట్టడంతో నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని అధిగమించేందుకు టెక్కలి మదనగోపాల సాగరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎడమవైపుగా ఉన్న ముంపు ప్రాంతం నుంచి 1.6 కిలో మీటర్ల మేర కొత్తగా కాలువను తవ్వి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీరు పోకుండా కొత్తగా తవ్వే కాలువ ద్వారా నేరుగా శివారు ప్రాంతాలకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రతిపాదనలు పరిశీలించిన చీఫ్ ఇంజినీర్ మరోసారి సర్వే చేపట్టి డీపీఆర్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. డీపీఆర్ త్వరలో ఇస్తామన్నారు. ఇదికాక రూ.1.60 కోట్లతో కేటగిరీ ఏ–పనులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మార్చిలో నిధులు మంజూరవుతాయని, ఏప్రిల్‌లో టెండర్లు పిలుస్తామని చెప్పారు. ఈ నిధులతో టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లో ఉన్న ప్రధాన, పిల్ల కాలువల్లో పూడిక తీసి, గట్లు బలంగా ఉండేలా బాగు చేస్తామన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ శోభాయాత్ర



కుశాలపురంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. జైశివాజీ నినాదాలతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శివాజీ జీవిత చరిత్రను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విశ్వహిందూ పరిషత్, జై భజరంగదళ్ సభ్యులు పాల్గొన్నారు.

శివాజీ ఆదర్శప్రాయుడు

లావేరు: చత్రపతి శివాజీను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని మురపాక శాఖా గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం శివాజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ యుద్ధ తంత్రాల్లోనే కాకుండా పరిపాలన విధానంలోనూ శివాజీ భారతదేశంలో అగ్రగణ్యుడిగా పేరు సంపాదించాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు.. కానరాని హెచ్చరిక బోర్డులు



కేశవరాయునిపురం హెచ్చరిక బోర్డులు లేకుండా ఉన్న మలుపు



గెడ్డలో బోల్తా పడిన వాహనం(ఫైల్)

లావేరు: మండలంలోని పలు గ్రామాల పరిధిలో మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. లావేరు నుంచి రణస్థలం వరకూ ఉన్న బీటీ రోడ్డులో ఏడు మలుపులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎక్కడా ప్రమాద హెచ్చరిక బోర్డులు గానీ, స్పీడు బ్రేకర్లు గానీ ఏర్పాటు చేయలేదు. ముఖ్యంగా లావేరు ఆంజనేయస్వామి గుడి వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వచ్చే వరకు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాజాం నుంచి రణస్థలం వరకూ ఇటీవల నిర్మించిన బీటీ రోడ్డులో కేశవరాయునిపురం, లావేటిపాలెం గ్రామాల మధ్య ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల కేశవరాయునిపురం మలుపు వద్దనే బొలేరో అదుపు తప్పి గెడ్డలో బోల్తా పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఒడిశాకు మట్టి అక్రమ రవాణా



స్టువట్‌పేట నుంచి ఒడిశాకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

పాతపట్నం: మండలంలోని ఎస్.ఎస్.మనుగు పంచాయతీలోని కింగ, స్టువట్‌పేట పక్కన ఉన్న జీడి తోటలు, పంట పొలాల నుంచి మట్టిని అక్రమంగా ట్రాక్టర్‌లు, లారీలపై బైదలాపురం, రుగడ రహదారి మీదుగా ఒడిశాకు తరలిస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి ప్రతి రోజూ పది నుంచి పన్నెండు ట్రాక్టర్‌లపై పగలు, రాత్రుళ్లు ఒడిశాకు తరలిస్తున్నారని ఆయా గ్రామస్తులు అంటున్నారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలో రియల్ అస్టేట్‌లకు ఈ మట్టిని తరిలిస్తున్నారని చెబుతున్నారు. ఇదే విషయం రెవెన్యూ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేస్తామని ఆయా గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ రవిచంద్ర వద్ద ప్రస్తవించగా.. తాము ఎవరికీ అనుమతు ఇవ్వలేదన్నారు. మైన్స్ శాఖ నుంచి అనుమతులున్నా తమకు చెప్పాలన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు తెలితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

నిద్రలేమితో వాహనాలు నడపవద్దు



లారీ డ్రైవర్‌తో ముఖం కడిగిస్తున్న పోలీస్

నరసన్నపేట: జాతీయ రహదారిపై వాహనాలు నడిపేవారు నిద్రలేమితో నడపవద్దని నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలం అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మడపాం టోల్‌గేట్ వద్ద వాహనాలను ఆపి డ్రైవర్లతో ముఖం కడిగించి, టీ తాగించి పంపించే కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. గతంలో ఈ చర్య ద్వారా వేకువ జామున ప్రమాదాలు తగ్గాయని ఎస్పీ భావించి ఈ విధానాన్ని మళ్లీ అమలు చేయాలని సూచించారు. నరసన్నపేట పోలీసులతోపాటు ఎస్‌హెచ్ పెట్రోలింగ్ పోలీసులు వేకువ జామున టోల్ ప్లాజా వద్ద వాహనాల డ్రైవర్లతో ముఖం కడిగించి పంపుతున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు నిద్రలేమితో వాహనాలు పడపటం వల్ల ప్రమాదాలు జరుగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేత్రపర్వం.. పరమేశ్వరుని తిరువీధి ఉత్సవం



భారీగా తరలివచ్చిన భక్తులు



కోటేశ్వరుని ఊరేగింపు



కొన్నావీధి భీమేశ్వరుని ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పరమేశ్వరుని ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. జిల్లా కేంద్రంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామిని మహా నందీశ్వర వాహనంపై ఉంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాలకు చెందిన ఉత్సవమూర్తులను వాహనాలపై ఉంచి ఊరేగింపుగా మేళతాళాలతో ఏడురోడ్ల కూడలి వద్దకు తీసుకొచ్చారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. గుడివీధి ఉమారుద్రకోటేశ్వరస్వామి, కొన్నావీధి భీమేశ్వరస్వామి, బోడెమ్మకోవెలలోని జీవేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ, పెంట శ్రీనివాసశర్మ, గంట చిన్నరామమూర్తి, ఉమామహేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

లింగోద్భవ సమయంలో..

- నాగావళి తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయం ఆధ్వర్యంలో లింగోద్భవ కాలంలో 11 అడుగుల శివలింగానికి పుష్పార్చనలు, జలాభిషేకం, ద్వాదశ హారతి సేవలను పీఠం నిర్వాహకులు గణేష్ గురుజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.
- అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఉమారుద్ర కోటేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశవార మహారుద్రాభిషేకం, 100 కేజీల బియ్యంతో అభిషేకం, లక్ష బిళ్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి. నక్కవీధి ఉమాజఠలే శ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- బలగ హడ్కోకాలనీ, భారతీనగర్‌లోని కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో కోటీ దీపారాధన, మంత్ర పుష్పార్చనలు జరిగాయి. అర్చకులు నేతేటి బాలసుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో సామూహిక పూజలు నిర్వహించారు. .



హడ్కోకలనీ కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున భక్తులు

లావేరు: అప్పాపురంలో ఆదివారం పార్వతీ పరమేశ్వరుల తిరువీధి మహోత్సవం వైభవంగా జరిగింది. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం, విఘ్నేశ్వర సహిత కాశీవిశ్వేశ్వర సమేత శ్రీదుర్గాదేవి సమస్రనామార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏఎంసీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు, అప్పాపురం సర్పంచ్ జగ్గురోతు నాగరత్నం, నాయకులు జగ్గురోతు సత్యనారాయణ, మీసాల తవిటినాయుడు, గొర్లె సూర్యనారాయణ, చందక నాగరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కోటీ దీపాల అర్చనలు



కాలబైరవాలయం వద్ద నాగావళి తీరాన 11 అడుగుల శివలింగానికి పూజలు



కోటేశ్వరుని లింగోద్భవ సమయంలో బియ్యం, లక్ష బిళ్వార్చనతో పూజలు



ఉమాజఠలేశ్వరస్వామికి బియ్యం, పూలతో అర్చనలు